సాక్షి
బాపట్ల
బుధవారం । 8 । అక్టోబర్ । 2025



మర్యాదపూర్వక కలయిక

నరసరావుపేటటౌన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కళ్యాణ్ చక్రవర్తిని పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా మంగళ వారం మర్యాదపూర్వకంగా కలిశారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 75,430 క్యూసెక్కులు వచ్చి చేరు తుండగా దిగువకు 0,430 క్యూసెక్కులు వదులుతున్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: సుబ్బారాయుడి సన్నిధిలో నిత్యాన్న దానానికి బాపట్ల జిల్లా పేరావళికి చెందిన దాది వివేకానందస్వామి, సీతామహాలక్ష్మి దంపతులు రూ. 1,00,108ను విరాళంగా సమర్పించారు.

న్యూస్‌రీల్

బాలికపై లైంగికదాడి కేసులో జైలు శిక్ష

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల పతులకాలనీకి చెందిన మైనర్ బాలిక (2)పై అదే ప్రాంతానికి చెందిన గురజాల మహేష్ అనే వ్యక్తి 2021 జనవరి నెలలో లైంగికదాడికి పాల్పడినట్టు మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం మహేష్‌కు 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ.12వేలు జరిమానా విధిస్తూ ప్రత్యేక ఒంగోలు పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.శైలజ మంగళవారం తీర్పును వెలువరించినట్లు పోలీసులు తెలిపారు. మైనర్ బాలికకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.3 లక్షలు నగదు పరిహారాన్ని చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేశారు.

నృసింహుని ఆదాయం రూ.48.45 లక్షలు



మంగళగిరి టౌన్ : మంగళగిరిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి హుండీ కానుకలను మంగళవారం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. ఎగువ, దిగువ సన్నిధులు, ఘాట్‌రోడ్‌లోని పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాలకు మొత్తం రూ. 48,45,565 ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. గతంలో కంటే రూ.2,94,429 అధికంగా వచ్చినట్లు వివరించారు. లెక్కింపు కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా పొన్నూరు శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి వారి దేవస్థాన కార్యనిర్వహణాధికారి జి.వి.అమర్‌నాథ్ పర్యవేక్షించారు.

పీజీ సోషల్ వర్క్ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ(పెదకాకాని): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ కోర్సు రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు మంగళవారం విడుదల చేశారు. 13 మందికి 11 మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునేవారు ఒక్కో పేపరుకు రూ.1,860 ఈనెల 17వ తేదీలోగా చెల్లించాలని సూచించారు.

బీటెక్ సప్లిమెంటరీ ఫలితాలు..

వర్సిటీ పరిధిలో బీటెక్ 3/4 మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను సీఈ శివప్రసాదరావు విడుదల చేశారు. 132 మందికి 87మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్ కోసం ఒక పేపరుకు రూ.2070 ఈనెల 17వ తేదీలోగా చెల్లించాలని సూచించారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించిన జేసీ



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి శివారు ఎన్నాదేవి వద్ద గల 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే మంగళవారం సందర్శించారు. 400 కేవీ సబ్‌స్టేషన్ అలియనేషన్‌లో భాగంగా ట్రాన్స్‌కోకు కేటాయించేందుకు ప్రతిపాదించిన 14.92 ఎకరాల స్థలాన్ని ఆయన క్షేత్రస్థాయి తనిఖీ చేశారు. ఆయనతో పాటు సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణా కాంతరెడ్డి, తహసీల్దారు కేవీఎస్ చక్రవర్తి తదితరులు ఉన్నారు.

రంగా వర్సిటీలో వాల్మీకి జయంతి



గుంటూరు రూరల్: గుంటూరు నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆదికవి వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంపీ రమణ వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం జాయింట్ రిజిస్ట్రార్ ఎం. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు కేళీ కష్టాలు

- టీడీపీ నేత వద్ద విత్తనాలు కొనుగోలు
- కాలపరిమితికి ముందే కంకుల రాక
- పంటను పరిశీలించిన కంపెనీ ప్రతినిధులు
- కేళీలు ఉన్నట్లు నిర్ధారణ
- రైతులను ఆదుకుంటామని హామీ



అనంతవరం వద్ద తాలు కంకులు ఈనిన వరి పైరు



అనంతవరంలో రంగు మారి ఏర్పడిన కేళీ కంకులు

కొల్లూరు: మండలంలోని అనంతవరంలో సాగు చేసిన సుమారు 500 ఎకరాల వరకు పంట కేళీల బారిన పడిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేళీల కారణంగా తమకు ఏర్పడుతున్న నష్టాన్ని పూడ్చాలని కోరుతూ సోమవారం కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. రైతుల విజ్ఞప్తి మేరకు మంగళవారం మండల వ్యవసాయ శాఖాధికారి నరేంద్ర వరి పంటలను పరిశీలించి కేళీలు వచ్చినట్లు రైతుల వద్ద నిర్ధారించారు. ఎస్ ఆర్‌ఐ కంపెనీకి చెందిన బీపీటీ 5204 రకం విత్తనాలను అనంతవరం గ్రామానికే చెందిన టీడీపీ నాయకుడు, ధాన్యం వ్యాపారి తమకు విక్రయించినట్లు రైతులు వ్యవసాయశాఖాధికారుల వద్ద వెల్లడించారు. వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడులు పెట్టడం, ధాన్యం కొనుగోళ్లు అతనే చేపడుతుండటంతో అతని వద్ద విత్తనాలు కొనుగోలుచేసి సాగు చేసినట్లు రైతులు వాపోతున్నారు. సాగు చేసిన పంట కాల పరిమితికి మించి ముందే ఈని వరి కంకులు రావడంతో పరిశీలించగా తాలు గింజలతో కూడిన కేళీలుగా నిర్ధారణైందని ఏఓ వద్ద మొరపెట్టుకున్నారు.



కేళీ కంకులు ఉన్న వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఏఓ నరేంద్ర కుమార్

పంట కాలపరిమితితో పని లేకుండా వరి కంకులు ఖరీఫ్‌లో సాగు చేసే బీపీటీ రకం విత్తనాలు సాధారణంగా 120 నుంచి 135 రోజుల కాల వ్యవధిలో పంట దిగుబడి రైతు చేతికందుతుంది. అనంతవరంలో రైతులు సాగుచేసిన ఎస్ఆర్ఐ 5204 రకం విత్తనాలు మాత్రం పంట కాలపరిమితితో పొంతన లేకుండా ముందుగానే తాలు గింజలతో కూడిన కేళీ కంకులు రావడం రైతులకు మింగుడు పడని వ్యవహారంగా మారింది.

కేళీలు ఉన్నమాట వాస్తవం

అనంతవరంలో సాగు చేసిన ఎస్ఆర్ఐ సీడ్ కంపెనీకి చెందిన విత్తనాల కారణంగా కేళీలు ఏర్పడిన మాట వాస్తవమేనని ఆ కంపెనీ ప్రతినిధుల బృందం రైతుల వద్ద అంగీకరించింది. రైతుల డిమాండ్‌తో అనంతవరంలో బెరుకు వరి కంకులు పరిశీలించిన ఆ కంపెనీ ప్రతినిధులు అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమావేశమై కేళీల వల్ల రైతులు నష్టపోతున్న మాట వాస్తవమేనన్నారు. కంపెనీ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి రైతులకు మేలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 15లోపు మరోమారు పొలాలను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కౌలుదారులను మింగిన కేళీలు



వరిలో కేళీల వల్ల కౌలు దారులకు తీవ్ర నష్టం ఏర్పడనుంది. 16 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని వరి సాగు చేశాం. ఎస్ఆర్ఐకు చెందిన బీపీటీ 5204 రకం విత్తనాల కారణంగా తీవ్రమైన పంట నష్టం ఏర్పడనుంది. కేళీల కారణంగా ధాన్యం దిగుబడులు సగానికి సగం తగ్గిపోతే కౌలుకు తీసుకున్న పొలాలకు కౌలు చెల్లించే వెసులుబాటు ఉండకపోగా, అప్పుల పాలవ్వాల్సి వస్తుంది.

–అలనేని శివప్రసాద్, కౌలు రైతు, అనంతవరం.

నష్టాన్ని పూడ్చేదెవరు



రైతులు నమ్మి సాగు చేసిన విత్తనాల వల్ల ఏర్పడిన నష్టాన్ని పూడ్చే బాధ్యత సీడ్ కంపెనీనే భరించాలి. నా సోదరుల పొలంతో కలుపుకొని 40 ఎకరాలలో ఎస్ఆర్ఐ విత్తన కంపెనీకి చెందిన బీపీటీ 5204 రకపు విత్తనాలు సాగు చేశాం. ఇతర విత్తనాలు సాగు చేసిన పంట సాధారణ స్థితిలో ఉండగానే బీపీటీ 5204 రకం సాగు చేసిన మా పంటలో కేళీ కంకులు ఏర్పడ్డాయి. కేళీ కంకుల వల్ల ఏర్పడుతున్న నష్టాన్ని విత్తన కంపెనీ ప్రతినిధులు రైతులకు చెల్లించాలి.

ధూళిపాళ్ల రవికుమార్, రైతు, అనంతవరం.

ధర తగ్గించే ప్రమాదం ఉంది



కేళీల కారణంగా ధాన్యంలో బీపీటీ రకం ధాన్యం రంగులో ఉండకుండా ఎర్ర రంగులో ఉండటంతో సరైన ధర లభించే అవకాశం ఉండదు. దీనివల్ల తమకు తీవ్ర నష్టం ఏర్పడుతుంది. తొమ్మిది ఎకరాలు కౌలుకు ఎస్ఆర్ఐకు చెందిన బీపీటీ 5204 రకం విత్తనం సాగు చేయడం వల్ల ప్రభుత్వ మద్దతు ధర సైతం లభించే అవకాశం ఉండదన్న ఆందోళనకు గురవుతున్నాం.

–జాలాది సాయిబాబు, కౌలు రైతు, అనంతవరం.

రైతుల నష్టం పూడ్చాలి



కేళీల బారిన పడిన రైతులకు వాటిల్లిన నష్టాన్ని ఎస్ఆర్ఐ విత్తన కంపెనీ తక్షణం పూడ్చాలి. ఇప్పటి వరకు సుమారు రూ.25 వేల వరకు పెట్టుబడులు వెచ్చించి సాగు చేసిన పంటలో తాలు గింజలతో కూడిన కేళీ కంకులు రావడం వల్ల రైతులు నష్టపోయారు. విత్తన కంపెనీ బాధ్యత వహించి ఒక్కో రైతుకు ఎకరాకు రూ.30 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలి.

–వి.వెంకట్రామయ్య, బి.సుబ్బారావు

స్ట్రయిట్ కట్ కాలువ పూడికతో ఇబ్బందులు

పూడిక తీసి ఆదుకోవాలంటూ కలెక్టర్‌కు విన్నవించిన రైతులు



చీరాలఅర్బన్: ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ పూడిపోవడంతో రైతులు నష్టాలు ఎదుర్కొంటున్నారని, కాలువ పూడికతీసి పంట పొలాలను కాపాడాలని ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ వ్యవసాయ భూముల రైతులు మంగళవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు విన్నవించారు. ఈపురుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ పూడిపోవడంతో మురుగు, వర్షపునీరు బయటకుపోక పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. స్ట్రయిట్ కట్ కాలువ పరిధిలో సుమారు 12 గ్రామాలు ఉండగా, దాదాపు 20 వేల ఎకరాలు ఈ కాలువపై ఆధారపడి సాగు చేస్తున్నామన్నారు. 1972లో అప్పటి ఇంజినీరింగ్ విభాగం రూపొందించిన ప్రణాళిక ప్రకారం ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ కాలువను నిర్మించారన్నారు. కాలువ నిర్మాణం కోసం రైతులు తమ సొంత భూములు ఇచ్చారని తెలిపారు. కానీ కాలువ సీ మౌత్ వద్ద పూర్తిగా పూడిపోవడంతో ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలల్లో కురిసే వర్షాలకు పంటలు మునిగిపోతున్నాయన్నారు. సమస్యపై గ్రీవెన్స్‌లో అర్జీ అందించామన్నారు. అలానే డ్రైనేజీ ఇంజినీర్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా తెలిపినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని వాపోయారు. తాజాగా కాలువపై మినీ హార్బర్, జెట్టీ నిర్మాణం చేయాలనే ప్రణాళిక ఉన్నట్లు సమాచారం అందిందని, ఈ ప్రాజెక్టు అమలైతే సముద్రంలోని ఉప్పునీరు ఈ కాలువ ద్వారా వ్యవసాయ భూములకు వస్తుందన్నారు. దీని వల్ల పంటలు పూర్తిగా నాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. చావలి వాసుదేవ హరి ప్రసాద్, నర్రా బ్రహ్మయ్య, శ్రీనివాసులు, వెంకటకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



కారంచేడులో యూరియా కోసం బారులు తీరిన అన్నదాతలు

కారంచేడు: కొమ్మమూరు ఆయకట్టు కింద సాగు చేస్తున్న వరి చేలకు అవసరమైన యూరియా కోసం అన్నదాతల పాట్లు తప్పడం లేదు. ఈ ఏడాది అసలే సాగు ఆలస్యంగా ప్రారంభించామని తలలు పట్టుకుంటున్న అన్నదాతలను యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోంది. బాపట్ల జిల్లాలో కొమ్మమూరు ఆయకట్టు కింద బాపట్ల, చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా. ఎగువన ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో కాలువకు సాగునీరు ప్రవహిస్తోంది. ముమ్మరంగా సాగు జరుగుతున్న ఈ రోజుల్లో యూరియా కొరత రావడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత 15 రోజుల క్రితం మండుటెండల్లో రైతుల పడిగాపులపై సాక్షిలో వచ్చిన కథనంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో వెంటనే మండలానికి మూడు లారీల యూరియాను సరఫరా చేసి సొసైటీల ద్వారా పంపిణీ చేశారు. ఎండల్లో నిలబడే పరిస్థితులు లేకుండా టెంట్‌లు వేసి పోలీస్ వారి సహకారంతో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం దగ్గరుండి యూరియాను సరఫరా చేశారు. ఇప్పుడు మళ్లీ అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మండల కేంద్రమైన కారంచేడులో యూరియా కోసం అన్నదాతలు మంగళవారం రోడ్డెక్కారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డులు పట్టుకొని బారులు తీరారు. మండల పరిధిలో ఎంత సాగు అవుతుంది? ఏయే పంటలు సాగు చేస్తారు? ఏయే సమయాల్లో ఎరువులు అవసరం అనే విషయాలపై అవగాహన లేకపోవడంతోనే ఈ సమస్యలు ఎదురవుతున్నాయని పలువురు రైతులు బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అసవరమైన ఎరువులు సరఫరా చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని రైతులు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయాలని వారు కోరుతున్నారు. రాయితీపై కాకుండా బహిరంగా మార్కెట్ ధరలకే యూరియాను అందుబాటులో ఉంచాలని కూడా కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- కారు, ద్విచక్ర వాహనం ఢీ
- మరో ముగ్గురికి గాయాలు
- వేములూరిపాడు వద్ద ఘటన
- 108 అందుబాటులో లేక ఆటోలో వైద్యశాలకు తరలింపు





ప్రమాదంలో మృతిచెందిన వారు

ఫిరంగిపురం: కారు, ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పొనుగుపాడుకు చెందిన రత్నసాగర్(33) భార్య, ఇద్దరు పిల్లలతో కలసి గుంటూరు వెళ్లారు. గుంటూరు– కర్నూలు రాష్ట్ర రహదారిలో ఇంటికి తిరిగివస్తుండగా వేములూరిపాడు వద్ద గుంటూరు వైపు వెళ్తున్న ఇన్నోవా వాహనం ఢీకొట్టింది. ఘటనలో ఇన్నోవా రోడ్డుకు మరోవైపు వెళ్లింది. రత్నసాగర్‌తో పాటు భార్య, పిల్లలు గాయపడ్డారు.

వీరితో పాటు అటువైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహన చోదకుడు గాయపడ్డారు. 108 అందుబాటులో లేకపోవడంతో ఆటోల్లో తరలిస్తుండగా రత్నసాగర్, గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం కారణంగా నిలిచిన ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

మహర్షి వాల్మీకి స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల: మహర్షి వాల్మీకిని ఆదర్శంగా తీసుకుని అధికారులంతా జిల్లా అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. శ్రీ మహర్షి వాల్మీకి జయంతి మహోత్సవం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన వాల్మీకి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి చేసిన కృషి మన జీవితానికి స్ఫూర్తిదాయకం కావాలన్నారు. చెడును విడిచిపెట్టి, మంచిని స్వీకరించడం ద్వారా మనుషులు ఋషులవుతారని జిల్లా ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ తెలిపారు. అకుంఠిత దీక్ష, జీవితం మారాలనే ఆలోచన కృషి ఆయనను మహర్షి వాల్మీకిగా చేసిందని ఆర్డీఓ పి.గ్లోరియా చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి శివలీల, వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్.విజయమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ మల్లికార్జునరావు, బీసీ సంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి

సుపరిపాలన, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేసిన మంచి అధికారి ఎస్.ఆర్. శంకరన్ అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్‌కుమార్ అన్నారు. ఎస్ ఆర్ శంకరన్ వర్ధంతి కార్యక్రమం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టరేట్ ఆవరణలోని ఎస్.ఆర్.శంకరన్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఎస్ఆర్ శంకరన్ జీవితంపై ఫుడ్ సైన్స్ కళాశాలలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా పతకాలు, జ్ఞాపికలను అందజేశారు.



మహర్షి వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరువయ్యేలా చూడాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరువయ్యేలా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీక్షణ సమావేశ మందిరంలో మైనారిటీ సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సంక్షేమ పథకాల అమలుపై నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు.

లక్ష్యం మేరకు సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం

సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. పంచాయతీ, మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలపై జిల్లా, మండలస్థాయి అధికారులతో మంగళవారం ఆయన వీక్షణ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. సామాజిక మరుగుదొడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం, జాప్యం ఉండరాదని కలెక్టర్ చెప్పారు. ప్రజలను చైతన్యపరిచి నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణ నిబంధనల ప్రకారం చేపట్టాలని కలెక్టర్ అన్నారు.

దుర్గమ్మ దసరా హుండీ ఆదాయం రూ.10.30 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై నిర్వహించిన దసరా ఉత్సవాల్లో భక్తులు హుండీల ద్వారా రూ.10.30 కోట్లను సమర్పించారు. ఉత్సవాల్లో అమ్మవారికి సమర్పించిన కానుకల లెక్కింపు మంగళవారంతో పూర్తయింది. తొలిరోజున రూ.3,57,92,708 నగదు, 122 గ్రాముల బంగారం, 9.7 కిలోల వెండి లభ్యమవగా..రెండో రోజు రూ.6,73,02,813 నగదు, 265 గ్రాముల బంగారం, 9.750 కిలోల వెండి లభ్యమైంది. దసరా ఉత్సవాల్లో హుండీల ద్వారా 480 సంచులతో దుర్గమ్మకు కానుకలు వచ్చాయి. వీటిని లెక్కించగా రూ.10,30,95,521 నగదు, 387 గ్రాముల బంగారం, 19.450 కిలోల వెండి లభ్యమైంది. గతేడాది కంటే దాదాపు కోటి రూపాయలు హుండీల ద్వారా అదనంగా లభించింది.

మత్స్యకారుల సమస్యకు పరిష్కారం దొరికేనా?

- ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ ఆక్రమణకు అడ్డుకట్ట పడేనా
- ఈపూరుపాలెం పూర్వపు రూపు తేల్చే పనిలో అధికారులు
- కాలువను పూడ్చి వేసి ఆక్రమించిన టీడీపీ నేత బుర్లా
- విచారణను అడ్డుకునేందుకు నానా ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ సీమౌత్ పూడ్చివేత వ్యవహారం తేల్చేందుకు జిల్లా కలెక్టర వి.వినోద్ కుమార్ సిద్ధమయ్యారు. ఇందు కోసం రెవెన్యూ, డ్రైనేజీ, మత్స్య శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, పోలీసు, సీఆర్‌జెడ్ తదితర విభాగాల అధికారులతో కమిటీ వేశారు. దీనిపై పది రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇదే అంశంపై గత కలెక్టర్ వెంకట మురళి కమిటీ వేసినా .. ఆ నివేదిక ఇప్పటికీ వెల్లడి కాలేదు. కాలువ ఆక్రమణదారుడు బుర్ల వెంకట్రావు తన పలుకుబడిని అడ్డుపెట్టి విచారణ ముందుకు సాగనివ్వలేదన్న ప్రచారం జరిగింది. ఇప్పుడు కొత్త కలెక్టర్ అదే అధికారులతో కమిటీ వేసి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. 1970 నుంచి ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ సీమౌత్ ఎలా ఉందో ఉపగ్రహ ఛాయా చిత్రాలను చూడాలన్నారు. 1980, 2000 నాటికి వచ్చిన మార్పులపైనా పరిశీలించాలన్నారు. తీరంలో డీకేటీ పట్టాల వ్యవహారాన్ని సమగ్రంగా పరిశీలించాలన్నారు. ప్రధాన కాలువ సముద్రం కలిసే ప్రాంతంలో కిలోమీటర్ల మేర సముద్రం నీటి వరకు కొండరాళ్లను ఎవరు వేశారు. తదితర విషయాలను తనకు ఇచ్చే నివేదిలో పొందుపరచాలని ఆదేశించారు.

అడ్డుకునే ప్రయత్నాల్లో బుర్ల వెంకట్రావు:

కమిటీ విచారణ అడ్డుకునేందుకు టీడీపీ నేత ,ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ సీ మౌత్ ఆక్రమణదారుడు బుర్లా వెంకట్రావు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఉన్నత స్థాయి వ్యక్తుల నుంచి కమిటీలో కొందరుకు ఫోన్‌లు చేయిస్తున్నట్లు సమాచారం. కమిటీ వారితో ప్రయోజనం లేదనుకున్న ఆయన సోమవారం జిల్లాకలెక్టర్ ను నేరుగా కలిసినట్లు సమాచారం. కలెక్టర్ అక్కడ జరిగిన ఆక్రమణలు, కొండరాళ్లను తెచ్చి సముద్రంలో కట్ట కట్టడం వంటి అంశాలపై సూటిగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీంతో టీడీపీ నేత ఉన్నత స్థాయిలో కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఇందు కోసం ఒక మంత్రిని సంప్రదించగా సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. బుర్లా కొందరు రైతులతో ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ ఎల్. ఆకారంలో కాకుండా నేరుగా ఉంటేనే అందరికీ ప్రయోజనం కలుగుతుందని మంగళవారం కలెక్టర్‌కు చెప్పించే ప్రయత్నం చేయగా, దీనికి ప్రతిగా కాలువ ఎల్ ఆకారంలో ఉండాలని, అలా అయితేనే అందరికీ మేలు కలుగుతుందని ఇటీవల రైతులు మీడియాకు చెప్పిన మాటలను మత్స్యకారులు కలెక్టర్‌కు చేరవేసినట్లు సమాచారం . ఈ క్రమంలో విచారణ సజావుగా సాగుతుందో లేదోనన్న అనుమానం మత్స్యకారులకు ఉంది.

క్లుప్తంగా

వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కొని పరారీ

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): గుర్తు తెలియని ఓ వ్యక్తి ఓ వృద్ధురాలి మెడలోని బంగారు నానుతాడు లాక్కొని వెళ్లిన సంఘటన మండల పరిధిలోని ఖాజీపాలెంలో ఆలస్యంగా వెలుగుచూసింది. చందోలు ఎస్ఐ ఎంవీ శివకుమార్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 6వ తేదీన సాయంత్రం 6గంటల సమయంలో ఖాజీపాలెం గ్రామానికి చెందిన దెందుకూరి సరస్వతి అదే గ్రామానికి చెందిన చిన్నలక్ష్మీపతిరాజు ఇంటికి వెళ్లి తిరిగి తన ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని ఓవ్యక్తి బైక్‌పై ఆమె వద్దకు వచ్చి ఇక్కడ ఇళ్లు అద్దెకు ఉన్నాయా అంటూ అడిగాడని తెలిపారు. ఆమెను మాటల్లో పెట్టి ఆమె మెడలో ఉన్న మూడున్నర సవర్ల బంగారు నానుతాడు లాక్కొని బైక్ మీద పారిపోయాడని తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలు దెందుకూరి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మార్టూరు: విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రం మార్టూరులో మంగళవారం రాత్రి జరిగింది. బాధిత కుటుంబం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక జనార్దన్ కాలనీకి చెందిన దేవరకొండ రాంబాబు (36) తన ఇంటి పై గల విద్యుత్ వైర్లను సరి చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ ఘాతానికి గురైన రాంబాబు ఇంటి పై నుంచి కింద పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడు రాంబాబుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలు

క్రోసూరు: బయ్యవరం గ్రామంలో పోలేరమ్మతల్లి, లక్ష్మీతిరుపతమ్మతల్లి గోపయ్యస్వామి ఆశీస్సులతో గత ఐదు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. విజేతల వివరాలు సీనియర్ విభాగంలో.. ప్రథమ బహుమతి హీరోహోండా డీలక్స్ బైక్‌ను ఏఎస్‌పీ సుంకి సురేంద్రరెడ్డి, సుంకి సాకేతరెడ్డి, సారికారెడ్డిల ఎడ్ల జత (హుజుర్‌నగర్, తెలంగాణ) గెలుచుకుంది. అదేవిధంగా ద్వితీయ బహుమతి రూ.60వేలు పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్లజత (బాపట్ల జిల్లా, బల్లికురవ) గెలుచుకుంది. బాపట్ల జిల్లా, వేటపాలెం, అత్తోటశిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరిల ఎడ్ల జత రూ.40 వేలు, కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన గరికపాటి శ్రీధర్‌కు చెందిన ఎడ్లు రూ.30వేలు, ప్రకాశంజిల్లా బేస్తవారిపేట, జేసీ అగ్రహారం, లక్కు నాగశివశంకర్‌కు చెందిన ఎడ్ల జత రూ.20 వేలు, తెలంగాణ రాష్ట్రం, మఠంపల్లి, గాయం శృజన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిల ఎడ్ల జత రూ.15వేలు, గుంటూరు జిల్లా, కాకుమాను మండలం, కొండబాలవారిపాలెంకు చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షితా చౌదరిల ఎడ్ల జత రూ.12వేలు గెలుచుకున్నాయి.

చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి హేయం



రేపల్లెలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

- రేపల్లె బార్ అసోసియేషన్
- విధులు బహిష్కరించి నిరసన
- రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించిన దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులు

రేపల్లె: దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై న్యాయవాది రాకేష్ అనుచితంగా ప్రవర్తించటంపట్ల రేపల్లె బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సెంటరులో రేపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొని దాడికి పాల్పడిన నిందితుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయటమంటే రాజ్యాంగంపై దాడి చేయటమేనన్నారు. రాకేష్‌ను న్యాయవాద వృత్తి నుంచి శాశ్వతంగా బహిష్కరణ చేయటంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనగాని శ్రీనివాసమూర్తి, రేపల్లె బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉప్పాల శ్రీనివాసరావు, మాజీ ప్రభుత్వ సహాయ న్యాయవాదులు దారం సాంబశివరావు, కర్రా ఐజాక్, న్యాయవాదులు గుంటూరు విజయ కుమారి, కట్టుపల్లి కాకమ్మ, ఎం.వెంకటేశ్వరరావు, గుడిపల్లి రవి, గురిందపల్లి రామారావు, నాలాది పోతురాజు, రేవు నాగరాజు, గుమ్మడి కుమార్ బాబు, మునిపల్లి సుబ్బయ్య, కర్రా జయరావు, నల్లూరి వెంకటేశ్వరరావు, దోవా రమేష్ రాంజీ తదితరులు పాల్గొన్నారు.

దాడి అమానుషం..



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

చీరాల రూరల్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై షూ విసిరి దాడిచేసేందుకు న్యాయవాది ప్రయత్నించడంపై మంగళవారం ఆగ్రహం పెల్లుబికింది. దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులు, ఆల్ ఇండియా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్మీ నాయకులు మాట్లాడుతూ ఇది భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థలపై దాడిగా అభివర్ణించారు. చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. తక్షణమే సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో కోరారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు మంగళవారం స్థానిక దళిత మహాసభ కార్యాలయంలో మాచవరపు జూలియన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశ అత్యున్నతమైన న్యాయస్థానం సుప్రీంకోర్టు సాక్షిగా సీనియర్ న్యాయవాది రాకేష్ కిషోర్.. సనాతన ధర్మాన్ని సీజేఐ బీఆర్ గవాయ్ అవహేళన చేశారని ఆరోపిస్తూ.. తన కాలిబూటు విసిరి దాడి చేసేందుకు యత్నించాడన్నారు. లౌకిక భారతదేశంలో సనాతనం పేరుతో అరాచకాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వ హయాంలో మతోన్మాదం పెరిగిపోతోందని, కరుడు కట్టిన ఆర్ఎస్ఎస్ భావజాలం జడలు విప్పుతోందని ఈ దాడివెనుక బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. తక్షణమే దాడికి యత్నించిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, బాపట్ల జిల్లా ఎంఎస్పీ అధ్యక్షుడు తేళ్ల జయరాజు, దళిత నాయకులు కాకుమాను రవి, గొర్రెముచ్చు ఏలియా తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు నల్ల రిబ్బన్‌తో నిరసన..

చీరాల రూరల్: ఆల్ ఇండియా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్మీ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మార్పు దీనరాజు.. చీరాల గడియార స్తంభం సెంటర్లో కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలియజేశారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో చీఫ్ జస్టిస్‌గా ఉన్న వ్యక్తిపై దాడి జరిగితే సామాన్యుల పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. కుల, మతాల మధ్య చిచ్చు పెట్టే విధానాన్ని తీవ్రంగా ఖండించారు. న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

దేశ అత్యున్న న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై న్యాయవాది బూటువిసిరి దాడిచేసేందుకు ప్రయత్నించినందుకు నిరసనగా మంగళవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు. ప్రజాస్వామ్యం దేశంలో ఇటువంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గొరవ రమేష్‌బాబు, మేరుగ రవికుమార్‌లు పేర్కొన్నారు.

మతోన్మాదిని శిక్షించాలి..



బాపట్లలో నిరసన ప్రదర్శన చేపట్టిన సీపీఎం నాయకులు

సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

బాపట్ల: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ పై మతోన్మాద న్యాయవాది చేసిన దాడి యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసనగా మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో బాపట్ల పాత బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ ఈ దాడి ఒక వ్యక్తిపై కాదని భారత రాజ్యాంగం పై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఈ ఘటనపై రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ప్రధానమంత్రి , స్పందించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.కృష్ణమోహన్, సిహెచ్ ముజుందర్, జిల్లా కమిటీ సభ్యులు పి కొండయ్య, నాయకులు కె. శరత్ , కె. నాగేశ్వరావు, టి.సుభాషిణి, మహబూబ్ సుభాని, చిన్న పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులు వైఎస్సార్ సీపీలో చేరిక



నడింపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులకు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న డాక్టర్ ఈవూరు గణేష్

- జగనన్న పాలన మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్

చెరుకుపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన మళ్లీ రావాలని అన్నివర్గాల ప్రజలు కోరుకుంటున్నారని, ప్రజల ఆశీస్సులతో వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. మంగళవారం గుళ్లపల్లి లోని తన క్యాంపు కార్యాలయంలో మండలంలోని నడింపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది, తెలుగుదేశం పార్టీ రేపల్లె నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బడుగు ఫణికుమార్‌తో పాటు అదే గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, స్థానిక సర్పంచ్ ఏమినేని సుబ్బారావు, పార్టీ మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, మరియు పలువురు వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు.

డాక్టర్ ఈవూరు గణేష్ వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి, కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఫణి కుమార్ మాట్లాడుతూ పేదలకు పూర్తిస్థాయిలో సంక్షేమం అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతోనే వైఎస్సార్ సీపీలో చేరినట్లు పేర్కొన్నారు. డాక్టర్ గణేష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కూటమిని చిత్తుగా ఓడించి, వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. పార్టీలో కొత్తా పాతా తేడా లేకుండా ఎలాంటి సమస్యవచ్చినా తనతో నేరుగా మాట్లాడి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. గ్రామ ఉపసర్పంచ్ ఆరాధ్యుల రోశయ్య, అలివేలు సన్ని, పెనుమాల రవి, అంబటి రాంబాబు, జంగం మాణిఖ్యారావు, దావులూరి రాంబాబు, జంగం విజయ్ కుమార్, పెనుమాల విద్యాసాగర్, మంచాల శ్రీనివాసరావు, షక్ ఫిరోజ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ

బాపట్లటౌన్: వాల్మీకి మహర్షి జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం వాల్మీకి జయంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి పొందిన రామాయణ మహాకావ్యాన్ని రచించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అన్నారు. యుగాలు మారినప్పటికీ రామాయణం ఇచ్చే ఆదర్శాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు. ప్రతి మనిషిలో ఉన్న చెడును తొలగించి మంచి దారిలో నడిపించే శక్తి వాల్మీకి రచనల్లో ఉందన్నారు. రామాయణ స్ఫూర్తితో కుటుంబ, మానవతా విలువలను పెంపొందించుకోవాలని, ధర్మబద్ధంగా జీవించాలన్నారు. ఎస్.బి. సీఐ జి.నారాయణ, అడ్మిన్ ఆర్ఐ షేక్ మౌలుద్దీన్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



చింతర్లంక వద్ద ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను నిలువరించిన తహసీల్దార్, ఎస్ఐ

కొల్లూరు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు

కొల్లూరు: కృష్ణా నదిలో ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని చింతర్లంక పరిధిలోని కృష్ణా నది నుంచి అధిక సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేపడతున్నట్లు అందిన సమాచారంతో తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, ఎస్ఐ జానకి అమర వర్ధన్‌తో కలసి నదిలోకి వెళ్లి పరిశీలించారు. ఆకస్మిక తనిఖీల సమయంలో నదిలో సుమారు 40 వరకు ట్రాక్టర్లు ఉండటాన్ని గమనించిన తహసీల్దార్, ఎస్ఐలు ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. దీంతో ట్రాక్టర్లలో నింపుకొన్న ఇసుకను వాహనదారులు నదిలో అన్‌లోడ్ చేసి వెనుతిరిగారు. తనిఖీల సమయంలో ఇసుక నింపుకొని వెళుతున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో సత్తా



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

చినగంజాం: చినగంజాం విద్యార్థులు 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తైక్వాండో పోటీల్లో సత్తా చాటారు. ఆరుగురు హాజరై గోల్డ్ మెడల్ సాధించారు. ఒంగోలులోని ఇస్లాం పేట షాదీకానాలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర జిల్లాల తైక్వాండో ఎంపికలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి, తైక్వాండో వైస్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ సలాం, ఉమ్మడి ప్రకాశం జిల్లా కోచ్‌లు, క్రీడాకారుల సమక్షంలో జిల్లా నలుమూలల నుంచి 69 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-17 విభాగంలో చినగంజాం సత్యం హైస్కూల్‌కు చెందిన కుక్కల రక్షిత్ రెడ్డి (38 కేజీల కేటగిరీ) గోల్డ్ మెడల్, వాటుపల్లి మౌనిక (42 కేజీలు) గోల్డ్‌మెడల్, అండర్ 14 విభాగంలో ఎల్. గీతిక (32కేజీల కేటగిరి) గోల్డ్ మెడల్ సాధించారు. సత్యం స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.హరినాథ్, ఆర్. శ్రీనివాసరావు, సి.రమేష్ క్రీడాకారులను అభినందించారు. చినగంజాం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అండర్-17 విభాగంలో సీహెచ్ జాషువా (42 కేజీల కేటగిరి) గోల్డ్‌మెడల్, బి.యశ్వంత్ (68 కేజీల కేటగిరి) గోల్డ్ మెడల్ సాధించారు. వీరంతా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె.శ్రీనివాసరెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయుడు జి.అంకమ్మరావు, ఎస్.నరసింహరావు, పి.వెంకట ప్రసాద్, రాష్ట్రస్థాయి ఎంపికైన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ వాటుపల్లి సుబ్రహ్మణ్యంను అభినందించారు.

ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృందం సభ్యులు

తాడికొండ: ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) బృందం రాజధాని అమరావతి పర్యటన వరసగా రెండో రోజు కొనసాగింది. విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో కమిషనర్ కె.కన్నబాబు, అడిషనల్ కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్, అమిలినేని భార్గవ తేజలతో ఏడీబీ- వాటర్-అర్బన్ డెవలప్మెంట్ సెక్టార్ బృందంలోని సభ్యులైన నోరియా సైటో(సీనియర్ డైరెక్టర్), మనోజ్ శర్మ(డైరెక్టర్), సంజయ్ జోషి(ప్రిన్సిపాల్ అర్బన్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్), అశ్విన్ హోసూర్ విశ్వనాథ్(సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్) సమావేశమయ్యారు. అనంతరం అమరావతి సచివాలయంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, పురపాలక- పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, పరిశ్రమలు-వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్ ఐఏఎస్‌లను కలిశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఐఏఎస్‌ను ఆయన చాంబర్‌లో ఏడీబీ బృందం కలిసినట్లు సీఆర్డీయే అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతి ప్రాజెక్టు పనులలో పురోగతి, ఏడీబీ అందజేస్తున్న ఆర్థిక సహకారం తదితర అంశాలను బృందంలోని సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించారు.

గంజాయి కేసులో నిందితుడికి జైలు, జరిమానా

తెనాలిరూరల్: గంజాయి కేసులో నిందితుడికి జైలు శిక్ష జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్ తీర్పు నిచ్చారు. రూరల్ ఎస్ఐ ఆనంద్ అందించిన వివరాలు... పట్టణ ముత్తెంశెట్టిపాలేనికి చెందిన గంటినపల్లి పూర్ణచందు, సీబీఎన్ కాలనీకి చెందిన మొగిలి సాయి, గండికోట గోపి బైక్‌పై వస్తూ 2021 అక్టోబర్ 16న పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా పెదరావూరు జంక్షన్ వద్ద 500 గ్రాముల గంజాయితో పట్టుబడ్డారు. వీరిలో గోపి పరార్ కాగా, మిగిలిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. కొద్ది రోజులకు గోపిని అప్పటి సీఐ ఎం. సుబ్రహ్మణ్యం, ఎస్ఐ జి.ఏడుకొండలు అరెస్ట్ చేశారు. ఈ కేసు మంగళవారం విచారించిన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఎ.పవన్‌కుమార్, ముద్దాయిలు పూర్ణచందు, మొగిలి సాయిలకు మూడు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. మూడో నిందితుడు గోపిపై కేసు కొట్టివేశారు. ప్రసిక్యూషన్ తరపున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COMPUTER EDUCATION

■ నిరుద్యోగ M/Fలకు Govt. ద్వారా ఉచితంగా కంప్యూటర్, TALLY, స్పోకెన్ ఇంగ్లీష్, M.S.ఆఫీస్ కోర్సులు నేర్పించి జాబ్ కల్పించబడును. ఫ్రీ హాస్టల్, ఫ్రీ మీల్స్ మరియు స్టైఫండ్ కలదు. సంప్రదించండి. సెల్: 94934 49782.

REAL ESTATE

HOUSE FOR SALE

■ Old అమరావతి మ్యూజియం దగ్గర రోడ్డు ప్రక్కనే 200 చ.గ.లలో నిర్మించిన ఇల్లు అమ్మబడును. ధర 80 లక్షలు. సంప్ర: 77024 38344

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర: 87907 41166

WANTED

■ గుంటూరు ప్రముఖ హోటల్ నందు పని చేయుటకు సూపర్‌వైజర్స్, రూమ్ బాయ్స్, హౌస్ కీపింగ్ వర్కర్స్ కావలెను. 8247814976, 9010042973

■ అకౌంటెంట్ కావలెను. బీకాం, 5 సం॥లు కంప్యూటర్ అకౌంట్స్‌పై అనుభవం, ఇన్‌కంటాక్స్ రిటర్న్స్‌కు ప్రిపేర్ చేయకలిగి, GST రిటర్న్స్ వేయగలిగిన వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

■ వాగ్దేశ్వ ఇంటీరియర్స్ నందు జాబ్ చేయుటకు మార్కెటింగ్ టీమ్ అనుభవం గలవారు అర్జంటుగా కావలెను. అర్హత: డిగ్రీ. సంప్ర: 7599999729

■ తెనాలిలోని కృష్ణ చికెన్ & పౌల్ట్రీ నందు క్యాషియర్ మరియు కలక్షన్ చేయుటకు M/F స్టాఫ్ కావలెను. 15000-18000. సంప్ర: 90522 90512

■ ప్రముఖ MNC, ఈ కామర్స్ వాటి అనుబంధ సంస్థలలో వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. అర్హత 10 to డిగ్రీ, జీతం 15000 నుంచి కలదు. సంప్ర: M.K. Enterprises. 8217813865

■ తెనాలిలోని ప్రముఖ హాస్పిటల్ నందు పని చేయుటకు PRO, స్టాఫ్ నర్స్ కావలెను. మంచిజీతం, టీబీ రోడ్డు, తెనాలి. 7702762108, 9666354489

■ నరసరావుపేట దగ్గర ప్రముఖ ఆక్వా కంపెనీలో పని చేయుటకు బాయిలర్ ఆపరేటర్ కావలెను. ITI / డిప్లమా ఎలక్ట్రికల్ క్వాలిఫికేషన్ కలిగిన యువకులు కావలెను. బయోడేటా పంపవలసిన mail id: admin@valvin.in 96639 09856, 94414 84802

■ రాజమండ్రి దగ్గర పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం డ్యూటీ, జీ: 12000, భోజనం+వసతి. చదువు అవసరం లేదు. వ: 50 సం.లోపు 88014 97437

■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీ కేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు. కావలెను. జీ : 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. 9347148051

■ Wanted a Marketing Executive to Work for Jr College in VJA. Salary + incentive 8297225577, 9676862477

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు
7075167663
7075167541

గమనిక

జీవ ఉత్ప్రేరకాల తయారీపై అవగాహన

బ్రెజిల్ బృంద సభ్యులకు శిక్షణ



కొల్లిపర: ప్రకృతి వ్యవసాయం విధానాలు, జీవ ఉత్ప్రేరకాల తయారీపై బ్రెజిల్ బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం కోసం 25 మంది బ్రెజిల్ ప్రతినిధుల బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అత్తోట, దావులూరిపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్ ఆఫీసర్ లక్ష్మనాయక్, బృందం సభ్యులకు బయో ఇన్పుట్‌ల తయారీ, ఘన జీవామృతం తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఏడాదిపాటు పంటలతో భూమిని కప్పి ఉంచడంతో పాటు ఏ గ్రేడ్, ఏ ప్లస్ గ్రేడ్, ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్, ఏటీఎం, పీఎండీఎస్ వంటి మోడల్స్ అనుసరించడం వలన కలిగే అనేక రకాల ప్రయోజనాలను బృంద సభ్యులకు అవగాహన కల్పించారు. దేశీ ఆవు, ప్రకృతి వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆవు పేడ, మూత్రంలో అధికంగా లభించే సూక్ష్మ జీవులు, భూమి సారాన్ని పెంచి పంటల ఆరోగ్యాన్ని కాపాడతాయని చెప్పారు. బృందం సభ్యులను ఆవు దగ్గరికి తీసుకువెళ్లి ప్రత్యక్షంగా పేడ, మూత్రం సూక్ష్మజీవుల ప్రాధాన్యంపై వివరించారు. అనంతరం స్వయంగా బృందం సభ్యులు బీజామృతం, ద్రవ, జీవామృతం, విత్తన గుళికల తయారీపై తర్ఫీదు ఇచ్చారు. దావులూరిపాలెంలో న్యూట్రి గార్డెన్, ఫుడ్ బాస్కెట్, ఆరోగ్యం, పోషకాహార కార్యకలాపాల లబ్ధిదారులను కలసి నిర్వహణ, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు జాకీర్ హుస్సేన్, కృష్ణారావు, వాణిశ్రీ పాల్గొన్నారు.

మిర్చి సీజన్ నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ శ్రీనివాసరావు

కొరిటెపాడు(గుంటూరు): రాబోయే మిర్చి సీజన్ నాటికి మిర్చి యార్డు లోపల, బయట రైతులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు కోరారు. మిర్చి సీజన్ ఏర్పాట్లపై మార్కెటింగ్ శాఖ అధికారులు, మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు, సూపర్ వైజర్లు, వేమెన్స్‌లతో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. తొలుత పలువురు ఎగుమతిదారులు మాట్లాడుతూ మిర్చి సీజన్‌లో సుమారు లక్ష మంది, అన్‌సీజన్‌లో 50 వేల మంది యార్డుపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. సీజన్‌లో యార్డులోని అన్ని గేట్లు తెరిచేలా చూడాలన్నారు. కొనుగోలు చేసిన మిర్చిని తరలించేందుకు ట్రాన్స్‌పోర్టు సమస్య ఉందని, యార్డుకు ఇరువైపులా రోడ్లు విస్తరించాలని సూచించారు. లారీల యూనియన్ సమస్య అధికంగా ఉందని, కిరాయి ఎక్కువగా ఉందని, దానిని నియంత్రించేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు. పరిశ్రమలకు ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కింద మాకు సబ్సిడీపై భూమి కేటాయిస్తే గోదాములు నిర్మించుకుంటామని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాకుండా మిర్చిని ఆరబెట్టుకునేందుకు డ్రయర్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆర్‌జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సీజన్ ప్రారంభం నాటికి యార్డులో అన్ని మౌలిక వసతులు పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ డీడీ దివాకర్, ఏడీఎం సత్యనారాయణ చౌదరి, యార్డు కార్యదర్శి ఎ.చంద్రిక, యార్డు అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, ఎగుమతి వ్యాపారులు జుగిరాజ్ భండారీ, కొత్తూరి సుధాకర్, తోట రామకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ అథ్లెట్ రష్మిశెట్టికి ఘన సన్మానం



లక్ష్మీపురం: జాతీయ అథ్లెటిక్స్‌లో గుంటూరు రైల్వే డివిజన్‌కి చెందిన టీటీఐ(రైల్వే టికెట్ ఇన్‌స్పెక్టర్) రష్మిశెట్టి కాంస్య పతకం సాధించడం అభినందనీయమని గుంటూరు రైల్వే డీఆర్ఎం సుధేష్ట సేన్ అన్నారు. గుంటూరు పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రష్మిశెట్టి 64వ జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో జావెలిన్ త్రో విభాగంలో కాంస్య పతకం సాధించారు. డీఆర్ఎం మాట్లాడుతూ ప్రధానంగా జాతీయ క్రీడా పోటీలలో గుంటూరు రైల్వే డివిజన్ తరుపున జావెలిన్ త్రోలో పాల్గొని సత్తా చాటిన రష్మి శెట్టిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

రైతు ద్విచక్ర వాహనం నుంచి రూ. 3 లక్షలు చోరీ

సత్తెనపల్లి: సినీఫక్కీలో గుట్టుచప్పుడు కాకుండా వెంబడించి రైతు ద్విచక్ర వాహనంలో నుంచి గుర్తు తెలియని దుండగులు రూ. 3 లక్షలు నగదు కాజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం కందులవారిపాలెం గ్రామానికి చెందిన రైతు బూతుకూరి శ్రీనివాస రెడ్డి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల యూనియన్ బ్యాంకుకు వచ్చాడు. బంగారు నగలు కుదువపెట్టి రూ. 3 లక్షలు నగదు తీసుకున్నాడు. ఆ నగదును ద్విచక్ర వాహనంలో పెట్టుకొని మాచర్ల రోడ్‌లో గల పెద్ద మసీదు ఎదురు గల తిరుమల ఫర్టిలైజర్స్ ముందు ద్విచక్ర వాహనం ఆపి ఆ కొట్లో ఎరువులు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. ఎరువులు కొనుగోలు చేసి తిరిగి నగదు కోసం ద్విచక్ర వాహనం వద్దకు రాగా అప్పటికే బ్యాంకు వద్ద నుంచి మాటు వేసిన గుర్తు తెలియని దుండగుడు ద్విచక్ర వాహనంలోని నగదును చోరీ చేశాడు. ద్విచక్ర వాహనంలో నగదు లేకపోవడాన్ని గుర్తించిన శ్రీనివాసరెడ్డి లబోదిబోమంటూ హుటాహుటిన పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ ఎస్ఐ జె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.